

10.128 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 10.128 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 381 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.73,920
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,638
3శాతం జీఎస్టీతో	రూ.6,837
నవర (8గ్రా)	రూ.54,696

గరిష్ఠం/కనిష్ఠం
35.4 /30.0

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 55 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 4 నుంచి 10వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, 8 నుంచి 12వ తేదీ వరకు కోర్సులు, కళాశాలలు ఎంపిక కోసం విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. 13న ఆప్షన్లు మార్పు, 16న సీట్లు కేటాయించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 22వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. 19వ తేదీ నుంచి తరగతులను ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 17 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ఆయా బ్రాంచ్‌ల్లో 8 వేలకు పైగా సీట్లు ఉన్నాయి. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో కళాశాలల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఆయా రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందినట్లు తెలిసింది. ఫార్మసీ ప్రవేశాల కోసం మరో నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు.

కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



మహేశ్వరుడు నుంచి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన కోటేశ్వరరావు

నెల్లూరు (సెంట్రల్): జిల్లా పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారిగా కోటేశ్వరరావు ఆదివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న మహేశ్వరుడు ఉద్యోగ విరమణ చేయడంతో ఇన్‌చార్జిగా కోటేశ్వరరావును ఆ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. మహేశ్వరుడు వద్ద నుంచి కోటేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నారు.

జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించి జిల్లా స్థాయి స్విమ్మింగ్ క్రీడాకారులను ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర మధు, సనత్‌కుమార్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13, 14వ తేదీల్లో కర్నూల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్కే మహబూబ్‌బాషా, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, డీఎస్‌ఏ కోచ్ నాగరాజు, మేకల చంద్రశేఖర్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటలో నిరాశే



నేలటూరు తీరానికి చేరిన పడవలు

ముత్తుకూరు: జూన్ 15వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా సముద్రంలో చేపల వేట ప్రారంభమైనప్పటికీ వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఆశించిన స్థాయిలో మత్స్య సంపద లభించడం లేదు. 61 రోజుల నిషేధం తర్వాత సమృద్ధిగా చేపలు, రొయ్యలు లభిస్తాయని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. అల్పపీడనం ప్రభావం వల్ల తరచూ సముద్రం కసురుగా ఉండడం వల్ల వాతావరణం ప్రతికూలంగా మారింది. కొంత మంది గంగపుత్రులు సాహసం చేసి వేటకు వెళ్లినప్పటికీ కొద్ది పాటి చేపలు, రొయ్యలతో వెనుదిరుగుతున్నారు. దొరికిన చేపలు డీజిల్ తదితర ఖర్చులకు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేలటూరు పట్టపుపాళెం, కృష్ణపట్నం పంచాయతీలోని ఆర్కాట్‌పాళెం, రామ్‌నగర్, ముత్తుకూరు పంచాయతీలోని పట్టపుపాళెం, ఈపూరు పట్టపుపాళెం మత్స్యకారులు పూర్తిస్థాయిలో వేటకు వెళ్లడం లేదు. వాతావరణం పూర్తిగా అనుకూలించిన తర్వాత వేటకు వెళ్లాలని భావిస్తున్నారు.

దేవుడి జాగా.. కబ్జాదారుల పాగా



దేవాలయాల్లో నిత్యం ధూప, దీప, నైవేద్యాల నిమిత్తం దాతలిచ్చిన మాన్యాలు ఆ శాఖ అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా అన్యాక్రాంతమవుతున్నాయి. జిల్లాలో చరిత్రాత్మక దేవాలయాలకు పూర్వీకులు వేలాది ఎకరాలను ధారాదత్తం చేశారు. దేవదాయశాఖ అధికారుల అండదండలతో ఆయా భూములను కౌలు పేరుతో దశాబ్దాలకుపైగా మోతుబరులు తమ గుప్పెట్లో పెట్టుకుని అనుభవిస్తున్నారు. కౌలు వేలానికి పెడితే కోర్టులకెళ్లి వ్యాజ్యాలు వేసి ఏళ్లకు ఏళ్లు తమ కబంధ హస్తాల్లోనే ఉంచుకుని రాబడి పొందుతున్నారు. ఇంకొందరైతే రెవెన్యూ అధికారులను లోబర్చుకుని రికార్డులను తారుమారు చేసి ఆ భూమలను తమ పేర్లపై మార్చేసుకుని క్రయ విక్రయాలు కూడా సాగించారు. ఆలయాలకు చెందిన చాలా భూములకు సంబంధించిన పత్రాలు కూడా దేవదాయశాఖ వద్ద కూడా లేకపోవడం గమనార్హం. మాన్యం భూములను లీజుల పేరుతో ఏటా అరకొరగా కౌలు చెల్లిస్తూ జేబులు నింపుకుంటున్నారు.



నెల్లూరు మినీబైపాస్ రోడ్‌లో టీడీపీ కార్యాలయం ఎదురుగా ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు

ఆక్రమణలో దేవదాయశాఖ భూములు

- రెవెన్యూ రికార్డులు తారుమారు చేసిన భూబకాసురులు
- 3,578 ఎకరాలు అన్యాక్రాంతం
- వీటి విలువ రూ.వెయ్యి కోట్లకు పైమాటే
- రికార్డుల్లో 1,348 ఎకరాల గల్లంతు
- ఈ భూముల విలువ రూ.75 కోట్ల పైనే..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా వ్యాప్తంగా దేవాలయాలకు చెందిన విలువైన భూములు గల్లంతయ్యాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు చాలా ఉన్నాయి. సింహపురి కేంద్రంగా వందల ఏళ్ల క్రితం రాచరిక పరిపాలన సాగింది. అప్పట్లో ఆలయాలను నిర్మించి, పునర్నిర్మించి వందల ఎకరాలను మాన్యాలుగా కేటాయించారు. ఇక కొందరు మోతుబరి రైతులు కూడా దేవాలయాల ఆలనా పాలనా కోసం ఎకరాలకు ఎకరాలు భూములిచ్చారు. ఇందుకు సంబంధించి హక్కు పత్రాలు కూడా ఇచ్చారు.

కరువైన ధూప నైవేద్యాలు

జిల్లా వ్యాప్తంగా రిజిస్టర్ అయిన 1,818 దేవాలయాలు ఉన్నాయి. ఆయా దేవాలయాలు చాలా వరకు ధూప, దీప నైవేద్యాలు కూడా జరగని దుస్థితిలో ఉన్నాయి. రూ.వందల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నప్పటికి కూడా ఆక్రమణల పర్వం, లీజుల పేరుతో స్వాహా పర్వాలతో దేవాలయ నిర్వహణ కూడా జరగటం లేదు. దేవాలయాలకు చెందిన 14,289.044 ఎకరాల భూములు లీజుకు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉంది. కానీ ఆ భూములు లీజు వ్యవహారం కూడా అస్తవ్యస్తంగా ఉంది. లీజు పేరుతో ఆక్రమణలు చేసి ఏళ్ల కాలంగా పెద్దల కబంధ హస్తాల్లో ఉంచుకున్నారు. కేవలం నామమాత్రపు లీజుతో రికార్డుల్లో చూపించి ఆయా భూములను మాత్రం తమ హక్కు అధీనంలో ఉంచుకుంటున్నారు. వందల ఎకరాల భూములు కలిగి ఉన్న దేవాలయాల్లో కూడా ధూప, దీప నైవధ్యాలు కరువైపోతున్నాయి.

ఆక్రమణలో రూ.వెయ్యి కోట్ల ఆస్తులు

జిల్లాలో వాస్తవంగా ఆయా ఆలయాలకు సంబంధించి పాత రికార్డుల ప్రకారం 36,283.1822 ఉన్నట్లు సమాచారం. ఇందులో గ్రామాల్లో వ్యవసాయ భూములతో పాటు పట్టణాల్లో విలువైన భూములకు సంబంధించి హక్కు పత్రాలు కూడా దేవదాయశాఖ ఖజానాల్లో భద్రంగా ఉన్నాయి. అయితే కొందరు అవినీతి అధికారులు చాలా ఏళ్ల క్రితమే వాటిని గల్లంతు చేసినట్లు సమాచారం. అలా సుమారు జిల్లాలో 2 వేల ఎకరాలకు సంబంధించిన హక్కు పత్రాలు లేవని తెలుస్తోంది. వీటికి సంబంధించి రెవెన్యూ రికార్డులు కూడా లేకపోవడం గమనార్హం. రెవెన్యూకు సంబంధించిన వందల ఏళ్ల నాటి పాత రికార్డులు వెలికి తీస్తే ఇంకా చాలా భూములు బయటపడే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇందులో దశాబ్దాలుగా అనాదీనంగా వదిలేసిన వ్యవసాయ, పట్టణ భూముల్లో సుమారు 3,578.25 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు దేవదాయశాఖ అధికారులే గుర్తించారు. వీటిల్లో చాలా భూములను సదరు ఆక్రమణదారులు రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి యాజమాన్య హక్కులు మార్చేసుకుని అనుభవిస్తున్నారు. మరి కొందరు విక్రయాలు చేయడంతో ఇప్పటికే చాలా చేతులు మారిపోయాయి. ఆక్రమించిన భూముల్లో భారీ భవనాలను నిర్మించారు. వీటి విలువ దాదాపు రూ.వెయ్యి కోట్లకుపైమాటగా ఉంటుందని అంచనా. ఇక రికార్డులు గల్లంతు చేసిన దాదాపు 1,348.6250 ఎకరాల భూముల విలువ సుమారు రూ.75 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇంత విలువైన భూములు ఏళ్లగా మాయం చేసినా అధికారులు కానీ, గత ప్రభుత్వాలు కానీ పట్టించుకోలేదు.

- నగరంలో ఉన్న తల్పగిరి రంగనాయకల స్వామి ఆలయానికి చెందిన 12.10 ఎకరాలు, మైపాడుగేట్ సమీపంలో మరో ఆలయానికి సంబంధించి 5 ఎకరాలు, నెల్లూరు నగరంలో ఉన్న బైరాగి మఠం భూములు ఆక్రమణలో ఉన్నాయి.
- నెల్లూరు నగరంలోని శ్రీహరినగర్ పరిధిలో 10 ఎకరాల భూమి పెంచలకోన నరసింహస్వామి ఆలయానికి సంబంధించినవిగా 2018లో గుర్తించారు. అప్పటి వరకు ఆలయ ఆస్తులు ఉన్నట్లుగా రికార్డులు కనిపించకుండా చేశారు. పెంచలకోన ఆలయానికి సంబంధించిన ఆస్తులు ఉన్నట్లు రికార్డులు ఉన్నా.. అవి ఆక్రమణలో ఉన్నాయి.



ఆలయ స్థలంలో ఆక్రమించి కట్టిన దుకాణాలు


జిల్లాలో దేవాలయాలు 1,818	మొత్తం మాన్యం 36,283 ఎకరాలు
పట్టణ ప్రాంతాల్లో భూములు 642 ఎకరాలు	గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవి 35,640 ఎకరాలు
దేవదాయశాఖ రిజిస్ట్రార్ ప్రకారం 34,934 ఎకరాలు	రికార్డుల్లో గల్లంతు చేసినవి 1,348 ఎకరాలు
అర్చకుల స్వాధీనంలో ఉన్నవి 1,267 ఎకరాలు	ఇతర సర్వీసు ఇనాం 287.710 ఎకరాలు
ఆక్రమణకు గురైనవి 3,578 ఎకరాలు	తస్తీక్ భూములు 12,711 ఎకరాలు

ఆక్రమణ భూములు స్వాధీనం చేసుకుంటారా?

జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి దేవదాయశాఖ మంత్రి అయ్యారు. పాలనా అనుభవంతో పాటు జిల్లాపై అవగాహన ఉన్న మంత్రి ఆనం ఇటీవల మీడియాతో మాట్లాడుతూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే ఆలయ భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. చాలా భూములు బడాబాబుల కబంధ హస్తాల్లో మగ్గుతున్నాయి. పురాతన ఆలయాలకు అపారమైన భూములు ఉన్నా కబ్జా కోరల్లో ఉండడంతో ధూప, దీప నైవేద్యాలకు జరగని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా నెల్లూరు నగరంలో రూ.వందల కోట్ల విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతం చేశారు. పెంచలకోన ఆలయ భూములు సైతం కబ్జా చేసియున్నారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం మంత్రి ఆనం తీసుకునే చర్యలపైనే అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వైద్యో నారాయణో హరిః

స్వచ్ఛమైన తెల్లని కోటు. మోముపై ఆత్మీయమైన చెరగని చిరునవ్వు. మొక్కవోని నిబ్బరం, అలుపెరగని అంకిత భావం, విసుగు ఎరుగని వృత్తిపై ప్రేమ వైద్యుడికి సహజమైన ఆభరణాలు. 'వైద్యో నారాయణో హరిః' అన్నారు పెద్దలు. దివిలో ప్రాణం పోసి మనల్ని భువిపైకి ఆ నారాయణుడు పంపిస్తే.. ఇలలో ఆ ప్రాణాలను నిలబెట్టేది డాక్టర్స్ కాబట్టి వారిని ఆ భగవంతుడితో పోల్చారు. కరోనా విలయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు వైద్యం అందించి దేవుళ్లయ్యారు.



- కోవిడ్‌లో ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు వైద్యం
- అందరికీ ఆరోగ్యం అందాలనే లక్ష్యంతో సేవలందిస్తున్న ప్రాణదాతలకు సలాం
- నేడు డాక్టర్స్ డే

నెల్లూరు (అర్బన్): వైద్యులు దేవుళ్లతో సమానం. వైద్య సేవలు ఎంతో గొప్పవి. అమ్మ మనకి జన్మనిస్తే.. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు, రిస్క్‌తో కూడిన శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చినప్పుడు వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తారు. అందుకే వైద్యో నారాయణో హరి అని మన పెద్దలన్నారు. అలాంటి వైద్యులను గుర్తు చేస్తూ దివంగత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత వైద్యుడు, విద్యావేత్త, భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్య రంగానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని భారతదేశంలో 1991 నుంచి జూలై 1వ తేదీని డాక్టర్స్ డేగా జరుపుకుంటున్నాం.

వృత్తిపై గౌరవం.. రోగులపై బాధ్యత

జిల్లా వ్యాప్తంగా సుమారు 1,300 వరకు ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో కార్పొరేట్ ఆస్పత్రులు 30 వరకు ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో 52 ప్రాథమిక ఆస్పత్రులు, 28 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక జిల్లా ఆస్పత్రి, కావలి, కందుకూరులో ఏరియా ఆస్పత్రులు, నెల్లూరులో సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2 వేల మంది డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది తమ వృత్తిపై గౌరవాన్ని ప్రదర్శిస్తూనే రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడాల్లేకుండా అత్యవసర వైద్యం అందిస్తూ రోగుల ప్రాణాలు కాపాడుతున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ డాక్టర్లే కీలకం

పేద వారందరికీ వైద్యం అందిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడడంలో ప్రభుత్వ డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. డయేరియా, సీజనల్ వ్యాధులు లాంటివి విజృంభించినప్పుడు పీహెచ్‌సీ స్థాయిలోనే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నారు. మలేరియా, ఫైలేరియా. డెంగీ వంటి వ్యాధులపై జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగిన రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

కోవిడ్‌లో ప్రాణాలు కాపాడింది ప్రభుత్వ వైద్యులే

ప్రపంచ మహమ్మారి కోవిడ్ వంటి జబ్బులు సమాజంలో విజృంభించినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి రూ. లక్షలకు, రూ.లక్షలు వసూలు చేశారు. అదే సమయంలో రూపాయి ఖర్చు లేకుండా తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రభుత్వ వైద్యులు పేదలకు ప్రాణం పోశారు. జిల్లాలో 2 లక్షల మందికి పైగా కోవిడ్ బారిన పడగా వారికి వైద్యం చేస్తూ జిల్లాలో ఐదుగురు డాక్టర్లు ప్రాణాలు సైతం కోల్పోయారు. నెల్లూరు పెద్దాస్పత్రిలో సైతం ఇద్దరు డాక్టర్లు ప్రాణాలు కోల్పోయారు.

నేడు సన్మానాలు

ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలందిస్తున్న పలువురు డాక్టర్లను సోమవారం జిల్లాలో వివిధ సంఘాలు సన్మానిస్తున్నాయి. వైద్యశాఖ


వైద్యం అందరికీ హక్కుగా అందాలి



కొంతమంది ధనవంతులకు అన్ని హంగులతో ఖరీదైన వైద్యం అందుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు సమాన వైద్య సేవలు అందడంలో లోపాలున్నాయి. డబ్బుతో సంబంధం లేకుండా ప్రజలందరికీ వైద్యం హక్కుగా అందాలి. అందుకోసం ప్రభుత్వం కృషి చేసేలా ప్రజలు ఒత్తిడి తీసుకుని రావాలి. మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తొలగించాలి.

– డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ రామచంద్రా రెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్

తక్కువ ఖర్చుకే వైద్యం అందాలి



పేద, ధనవంతులనే తేడా లేకుండా ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో వైద్య సేవలందాలి. వైద్యం వ్యాపారంగా మారకూడదు. వైద్య రంగానికి ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. రోగం వచ్చిన తర్వాత నయం చేసే వైద్యం కన్నా ఆ జబ్బు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

– డాక్టర్ రఫీ, జీవీకే మెమోరియల్ ట్రస్ట్ నెల్లూరు ఆస్పత్రి

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీకి ప్రణాళిక

- జిల్లాలో పంపిణీ ప్రక్రియలో పాల్గొననున్న 8,500 మంది ఉద్యోగులు
- జిల్లాలో 3,16,001 మంది లబ్ధిదారులకు రూ.216.77 కోట్లు మంజూరు
- మంత్రి నారాయణ



ఎంపీ వేమిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (బారకాసు): రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజామున నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరగనుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరు నగరంలోని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటల నుంచి సామాజిక పింఛన్ల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 65 లక్షల మందికి ఈ సామాజిక పింఛన్లు అందజేయనున్నట్లు వివరించారు. జిల్లాలో ఉన్న మొత్తం 3,16,001 మంది లబ్ధిదారులకు రూ.216.77 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. తొలి రోజే పూర్తి స్థాయిలో పింఛన్లను పంపిణీ చేసేందుకు 8,500 మంది ఉద్యోగులు సమాయత్తమయ్యారన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా రూ.3 వేలు ఉన్న సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంచడమే కాకుండా, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున రూ.3 వేలతో కలిపి మొత్తం రూ.7వేలు ఇవ్వనున్నట్లు మంత్రి వివరించారు. 2019 ఫిబ్రవరి నాటి వరకు తాను మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.5,300 కోట్లు మంజూరు చేశామన్నారు. గడిచిన ఐదేళ్లలో గత ప్రభుత్వం అదే ప్రాజెక్టుల కోసం కేవలం రూ.240 కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి రావాల్సిన ఉన్న గత ప్రభుత్వం నిధులకు సంబంధించిన బిల్లులను కేంద్రానికి అందించకపోవడంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.వెయ్యి కోట్లు నిధులు ఆగిపోయాయన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఎస్ఈ సంపత్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చెన్నుడుతో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంపిణీ

నెల్లూరు (పొగతోట): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. టీడీపీ ప్రభుత్వం రూ.1000 పింఛన్ పెంచింది. ప్రతి నెల రూ.4 వేలు పింఛన్ నగదు లబ్ధిదారులకు అందజేయనున్నారు. మూడు నెలల బకాయిలు రూ.3 వేలతో పాటు ఈ నెలకు సంబంధించి రూ.4 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు లబ్ధిదారులకు అందజేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,16,001 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ నెల 1,2 తేదీల్లో మాత్రమే నగదు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ రెండు రోజుల్లో పింఛన్ నగదు తీసుకోలేని లబ్ధిదారుల విషయంపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. వారికి మరుసటి నెలలో అందజేస్తారా అనే విషయంపై కూడా స్పష్టత లేదు. సచివాలయాలు, పంచాయతీ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛన్ నగదు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. లబ్ధిదారులందరూ అందుబాటులో ఉండి పింఛన్ నగదు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు.

ఎన్నికల వ్యయంపై అభ్యంతరాలు రాలేదు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

- జేసీ సేతు మాధవన్

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఖర్చులపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల వ్యయంపై పునః సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యయ పరిశీలకులు ప్రసాద్ దత్తాత్రేయ, కాంచన్ రామ్ మీనా, జ్యోతిమయి బైలంగ్ పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఫలితాలు వెలువడిన 26 రోజుల్లో పునః సమీక్ష సమావేశం నిర్వహించాల్సి ఉంది. పోటీ చేసిన అభ్యర్థులు చూపిన వ్యయానికి జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ రూపొందించిన వ్యయానికి పునః సమీక్షించడం ఎన్నికల బాధ్యతల్లో భాగమన్నారు. జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ తయారు చేసిన వ్యయ నివేదికలపై ఆయా పార్టీల అభ్యర్థులు ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని జేసీ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి విద్యాసాగర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

• వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన తిరుపతిరెడ్డి

సంగం: మోటార్‌బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని తరుణవాయి వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బద్వేల్‌కు చెందిన తిరుపతిరెడ్డి బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. తరుణవాయి వద్ద వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఆ బైక్‌ను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో తిరుపతిరెడ్డి తీవ్రంగా గాయపడగా స్థానికులు గుర్తించి 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది ఆయన్ను నెల్లూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా

• నీటి పాలైన ధాన్యం



సైదాపురం: ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి కలిచేడు వ్యవసాయ పొలాల్లో ఆదివారం బోల్తా పడింది. దీంతో లారీలోని ధాన్యం బస్తాలు నీటిలో పడిపోయాయి. కలిచేడుకు చెందిన రైతు మాలపాటి శీనయ్య లారీలో ధాన్యం బస్తాలను మిల్లుకు తరలిస్తుండగా దారిలో ఈ ప్రమాదం జరిగింది. ఈ మార్గంలో రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్లే లారీ బోల్తా పడిందని బాధిత రైతు వాపోయారు.

నేటి నుంచి ‘టోల్’ బాదుడు

చిల్లకూరు: జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాల్లో సోమవారం నుంచి అధిక రుసుము వసూలు చేయనున్నారు. గతంలో కంటే మరో రూ.15 వరకు పెరగనుంది. ఇందుకు సంబంధించి టోల్‌ప్లాజాల ప్రతినిధులు ప్రకటనలు సైతం ఇప్పటికే విడుదల చేశారు. జాతీయ రహదారి భద్రతను ఏమాత్రం పట్టించుకోని టోల్‌ప్లాజాల నిర్వాహకులు వాహనాల నుంచి రుసుము వసూలు చేయడంలో అత్యుత్సాహం చూపుతుంటారని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయించి, వాహనాలకు సక్రమంగా పార్కింగ్ సౌకర్యం కల్పించి, హైవే పక్కన ఆక్రమణలను తొలగించి తర్వాత రుసుము పెంచి ఉంటే బాగుండేదని సూచిస్తున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓగా మూర్తి

శ్రీకాళహస్తి: తిరుపతి దేవదాయ శాఖ ఆర్‌జేసీగా పనిచేస్తున్న ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లను ఆయన దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జునప్రసాద్, సతీష్‌మాలిక్, హరియాదవ్, నాగభూషణం యాదవ్ పాల్గొన్నారు.

కొరవడిన నిఘా.. దొంగల బరితెగింపు

పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు విజృంభిస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలపై దాడులు, హత్యలు చేసి బంగారు ఆభరణాలను దోచుకెళ్తున్నారు. దేవాలయాలను సైతం వదలడం లేదు. వరుస ఘటనలు జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

- బుచ్చిరెడ్డిపాళెంలో వెలుగు చూసిన భారీ చోరీ
- వరుస ఘటనలతో జనం బెంబేలు
- కట్టడికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు



ఉదయగిరిలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడునెలలపాటు జిల్లాలో పోలీసుల గస్తీ ముమ్మరంగా సాగింది. సాయుధ బలగాల కవాతుతో చోరీలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పోలీసుల సంచారం అంతంతమాత్రంగానే ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న దొంగలు పేట్రేగిపోతున్నారు. యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఓ కేసులో నిమగ్నమై ఉండగానే మరోచోట నేరానికి పాల్పడుతూ సవాల్ విసురుతున్నారు.

హత్యకూ వెనుకాడని వైనం

చోరీ చేసే సమయంలో దాడి చేయడం, అవసరమైతే హత్య చేసేందుకు వెనుకాడడం లేదు. కొంతకాలం క్రితం సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో సుబ్బమ్మ అనే వృద్ధురాలిని హత్య చేసి నాలుగు సవర్ల బంగారు సరుడు దోచుకెళ్లారు. వారం రోజుల క్రితం కలువాయి మండలం కుల్లూరులో ఒంటరిగా ఉంటున్న పెంచలమ్మ అనే వృద్ధురాలు కళ్లలో కారం కొట్టి చంపేస్తామని బెదిరించారు. ఆమె కాళ్లు, చేతులు కట్టేసి మెడలోని మూడున్నర సవర్ల బంగారు గొలుసును దోచుకున్నారు. గాజులు తీసుకుంటుండగా స్థానికులు రావడాన్ని గమనించి దుండగులు పరారయ్యారు. నెల్లూరు నగరంలోనూ ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి.

జిల్లాలో ఇటీవల జరిగినవి

తాళాలు వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా దొంగలు బరితెగిస్తున్నారు. పగలంతా వీధుల్లో రెక్కీ వేస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు.

➡ రెండు రోజుల క్రితం బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ ఉపాధ్యాయుడు కుటుంబంతో సహా ఊరు వెళ్లడంతో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.3 లక్షల నగదు, సుమారు 40 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు.

➡ విడవలూరులో శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంట్లో రూ.1.28 లక్షల నగదు, పది సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు.

➡ ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల బాలుర వసతి గృహంలో రూ.3 లక్షల విలువ చేసే ఐఫోన్లు, ఐప్యాడ్ తదితరాలను చోరీ చేశారు.

➡ వడారుపల్లి ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.2.45 లక్షల నగదును దోపిడీ చేశారు.

➡ ఉదయగిరి పట్టణ సమీపంలోని బీసీ కాలనీలో ఖాసింపీర్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నారు. అతని కుమార్తె హాఫీజ యూనియన్ రోడ్డులో ఉంటోంది. ఆమె ఆరోగ్యం బాగోలేక ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. దీంతో అతను తన భార్యతో కలిసి ఇటీవల కుమార్తె వద్దకు వెళ్లాడు. భార్యాభర్తలు ఊరెళ్లారని గుర్తించిన దుండగులు లోనికి ప్రవేశించి రెండు బెడ్‌రూముల్లో బీరువాలు ధ్వంసం చేసి 15 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. బాధితుడు చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీం బృందం వేలిముద్రలు సేకరించింది.

➡ దొంగలు దుకాణాల్లోనూ చోరీలకు పాల్పడుతున్నారు. పగటి వేళ వినియోగదారులుగా వెళ్లి రెక్కీ చేసి రాత్రివేళల్లో దొంగతనాలు చేస్తున్నారు. రైతుల వ్యవసాయ మోటార్లు చోరీలు చేస్తున్నారు. దేవాలయాలకు భద్రత కొరవడింది. ఇక వాహనాల సంగతి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో వాహనాలు చోరీకి గురవుతూనే ఉన్నాయి.

మొక్కుబడి విధులు

నేర నియంత్రణకు ఏర్పాటు చేసిన సీసీఎస్ పోలీసు స్టేషన్ మొక్కుబడి విధులకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. అడపాదడపా నిందితులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీ చేస్తున్నారు. ఇక స్టేషన్ల పరిధిలోని క్రైమ్, ఐడీ పార్టీలు అసలు విధులను మరిచి కొసెరు విధులకే ప్రాధాన్యతనిస్తున్నారన్న ప్రచారం ఉంది. పార్టీలు స్టేషన్ పరిధిలోని పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలి. జైలు నుంచి విడుదలైన పాతనేరస్తులు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారనే వివరాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఎవరైనా తిరుగుతున్నారా? లేదా? అనే సమాచారాన్ని సేకరించాల్సి ఉంది. అయితే అనేక స్టేషన్లలో క్రైమ్, ఐడీ పార్టీలు కేవలం ఆ స్టేషన్ అధికారులకు ఆదాయ వనరులు చేకూర్చిపెట్టే పనిలోనే నిమగ్నమైనట్లు ఆరోపణలున్నాయి.



దృష్టి సారించిన ఎస్పీ

వరుస ఘటనల నేపథ్యంలో ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ చోరీల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల జరిగిన నేర సమీక్షా సమావేశంలో జిల్లా వ్యాప్తంగా బీట్ వ్యవస్థను పటిష్టం చేయాలని, వాహన తనిఖీలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చోరీ కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతోపాటు రికవరీ శాతాన్ని పెంచాలని ఆదేశించారు.



బుచ్చిరెడ్డిపాళెంలో చోరీ ఘటనను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

వెంకటాచలం: కష్టకాలంలో పార్టీకి వెన్నంటే ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసానిచ్చారు. మండల కేంద్రమైన వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిచిన రోజు నుంచే గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. ఆస్తులను ధ్వంసం చేసి నష్టం కలిగిస్తున్నారన్నారు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. దాడుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా కొన్నిచోట్ల పట్టించుకోవడం లేదని, ఇదేమిటని ప్రశ్నించారు. అన్ని పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీట్లు తగ్గాయే తప్ప, ఓట్ల శాతం ఏ మాత్రం తగ్గలేదన్నారు. అధికారంలోకి రాకపోయినా 40 శాతం మంది వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తమ పార్టీకి అండగా నిలిచిన వారికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ చిన్న ఇబ్బంది కలిగించినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. 2019–24 మధ్య సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు, సైడు కాలువలు, తాగునీటి పథకాలు, సాగునీటి కాలువల నిర్మాణాలు చేయించామని పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నాయకులు పెళ్లూరు సుధాకర్‌రెడ్డి, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, వెలిబోయిన వెంకటేశ్వర్లు, డక్కలి రమణయ్య, మందల పెంచలయ్య, కుంచె రమేష్, నాటకం శ్రీనివాసులు, అడపాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో కొలువైన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు రకాల అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయంలోని రావి చెట్టు, త్రిశూలం వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకరణలో ముత్యాలమ్మ

కండలేరులో 6.303 టీఎంసీలు



జలాశయం (ఫైల్)

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.303 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 127
లేయర్ (లైవ్) : 120
బ్రాయిలర్ చికెన్ : 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 256
లేయర్ చికెన్ : 204

హనుమాన్ ప్రసాద్‌కు ఘన సన్మానం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మూడేళ్లపాటు పనిచేసి డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ చేసిన అన్నవరం హనుమాన్ ప్రసాద్‌ను ఆ శాఖ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఇందులో చిత్తూరు జిల్లా డీఎస్ఎల్ఓ గౌస్‌బాషా, జిల్లాకు చెందిన సర్వే ఇన్‌స్పెక్టర్లు ఎంవీ రమణ, కేవీ శేషగిరిరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వి.పూర్ణప్రకాష్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జిల్లా సర్వే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ అంకయ్య, కోశాధికారి యామిని తదితరులు హనుమాన్ ప్రసాద్ పనితీరును కొనియాడారు. రీ సర్వే తదితర అంశాల్లో జిల్లాను ఆయన ముందంజలో నిలిపారన్నారు.



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు తదితరులు

ముగిసిన గని కార్మికుల భద్రతా వారోత్సవాలు

సైదాపురం: మండలంలోని గోగినేనిపురంలో ఆదివారం జిల్లా గని కార్మికుల భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారోత్సవాల కమిటీ కన్వీనర్ గోగినేని భరత్ అధ్యక్షత వహించిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్ అండ్ సేఫ్టీ సౌత్ జోన్ అధికారి భూషణ్‌ప్రసాద్ సింగ్ మాట్లాడుతూ కార్మికుల భద్రతకు యాజమాన్యాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఏటా భద్రతా వారోత్సవాలను నిర్వహించి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. గని కార్మికులు కూడా పనివేళల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డీఎంఎస్ రఘుపతి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. డీడీఎంఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ కార్మికులకు ముందస్తుగా పనులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యదేనన్నారు. అనంతరం గని కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



కార్మికుడిని సన్మానించిన అధికారులు, కమిటీ సభ్యులు

ఏడీపీఎస్ కార్యాలయం ఏర్పాటు

కలువాయి: మండల కేంద్రమైన కలువాయిలో అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి మండల శాఖ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిజమాల ప్రసాద్ తదితరులు కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు గోపాల్, సీహెచ్ రమణయ్య, వెంకటయ్య, వెంకటరమణ, శ్రీనివాసులు, గొల్లపల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అనుబంధ ఆలయాల్లో విశేష ఉత్సవాలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ అనుబంధ ఆలయాల్లో ఈనెలలో విశేష ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. 4 నుంచి 14వ తేదీ వరకు నారాయణవనంలో పరాశరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, 10 నుంచి 12వ తేదీ వరకు శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వెంకటేశ్వర స్వామి సాక్షాత్కార వైభవోత్సవాలు, 16 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక జ్యేష్టాభిషేక ఉత్సవాలు జరుగుతాయన్నారు. 17 నుంచి 25వ తేదీ వరకు తాళ్లపాకలోని శ్రీసిద్దేశ్వరస్వామి, శ్రీచెన్నకేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 20వ తేదీ వరకు తిరుపతిలోని కపిలేశ్వర స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు, 18 నుంచి 22వ తేదీ వరకు శ్రీవైఖానసాచార్య ఉత్సవాలు, 21న వ్యాసపూర్ణిమ, గురుపూర్ణిమ, 26న సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశ్వరస్వామి ఆలయాల్లో వార్షిక పుష్పయాగం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. 29న ఆండాళ్ అమ్మవారి తిరువడిపూడి ఉత్సవం, 30న తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలకు అంకురార్పణం, ఆడికృత్తిక, 31న సర్వ ఏకాదశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు జేఈఓ వెల్లడించారు.